# భామా, బామ్మ!

"నేనింతగా బాధపడుతూ, గుండెల్లో రేగిన మంటనిఆవేదనతో మీకు చెప్పుకుంటూంటే, మీరిద్దరూ ఏవిటలా ఏమీ పట్టనట్లు విని ఊరుకున్నారు? అసలు మీరు విన్నారా అని?" అంటూ నిలదీసి ప్రశ్నించింది సత్యభామ, ఉరఫ్ 'భామ, అమ్మనీ, బామ్మనీ.

'ఊ' అని దీర్ఘంగా నిట్టూర్చి, మెరుగు తుడుస్తూన్న వెండి దీపం కుందెలు పక్కని పెడుతూ, 'వినకేం అమ్మా! అంతా పూర్తిగా విన్నాం' అంది సీతమ్మ నిర్వేదంగా.

'నువ్వు అమ్మా'?

'నేనూ విన్నాను తల్లీ' అంది లక్ష్మి, బట్టలు సర్దడం పూర్తిచేసి, బీరువా తలుపు వేస్తూ.

"ఏం విన్నావో చెప్పు... ఊ.. చెప్పు"

'ఏం ఉంది? కాపురానికి వెళ్ళింది లగాయితు ఈ రెండేళ్ళలోనూ, అతగాడు నిన్నెప్పుడూ సరదాగా ఓ సినీమాకి కానీ, ఓ పిక్‌నిక్‌కి కానీ, కనీసం షికారుకి కాని తీసికెళ్ళలేదనీ, ఎంత సేపటికీ ఆఫీసు పనులూ, స్నేహితుల అవసరాలూ అంటూ ఇల్లు పట్టకుండా తిరుగుతూఉంటాడనీ...'

'నే చెప్పింది అదా? ... అంతే చెప్పానా? ఏం విన్నావమ్మా నువ్వు? బామ్మా! నేనింతకంటే ఏం చెప్పలేదూ?" కోపంగా చూస్తూ అడిగింది సత్య.

"చెప్పావు తల్లీ! నీ ఇష్టం వచ్చిన అలంకరణ నిన్ను చేసుకోనియ్యడనీ, ఏవిటా తల విరబోసుకు తిరగడం? చక్కగా జుట్టు దువ్వుకొని జడ వేసుకో లేవూ? ఆ పంజాబీ డ్రెస్సూ కుర్తా పైజమా అవతల పడేసి చీరలు కట్టుకో. ముఖానికి ఎంతసేపటికీ క్రీములూ పౌడర్లేనా, నెలకోసారైనా పసుపు రాసుకోవడం ఉందా? బొట్టు మరికాస్త పెద్దది పెట్టుకోరాదూ? అంటూ అనుక్షణం వేధిస్తాడనీ, అతని సాధింపు భరించలేక పోతున్నాననీ కూడా చెప్పావు" అంది సీతమ్మ మనుమరాలికి ఎక్కడ కోపం వస్తుందో అనే భయంతో అనునయంగా బుజ్జగింపు ధోరణితో.

భామకి ఉడుకుమోత్తనం వచ్చింది.

కళ్ళనీళ్ళు పెట్టుకుని బొంగురుపోయిన కంఠంతో 'పొండి - మీరు వినలేదు. నా అసలు సమస్యని మీరు పట్టించుకోనే లేదు' అంది.

'పట్టించుకోకపోవడం ఏమిటమ్మా?' అంది లక్ష్మి.

'ఏం పట్టించుకున్నారు? ఇంట్లో నాకు పెత్తనం లేదు. నా అభిప్రాయాలకి విలువలేదు. ఎంత సీరియస్‌గా చెప్పినా, నా మాటని ఆయన తేలిగ్గా నవ్వి తీసిపారేస్తారు. నేనూ ఒక వ్యక్తిననీ, నాకూ ఇంట్లో ఓ గుర్తింపూ, గౌరవం ఉండాలనీ, ఆయన గమనించరు. అందువల్ల రోజు రోజుకీ నా అభిమానం దెబ్బతింటోంది. కేవలం ఆయన నీడలా, ఆయనాశయాలకీ, అభిరుచులకీ, అణుగుణంగా మసులుకొనే యంత్రంలా, ఓ కట్టు బానిసలా నే బ్రతకలేను. నాకూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కావాలి. వ్యక్తిత్వం చంపుకొని ఆయన పంచని బ్రతకడం కంటే, నా ఉనికిని సార్థకంచేసుకుంటూ విడిగా ఉండడం మంచిది అనే నిర్ణయానికి వచ్చాను. నా సమస్య ఏమిటో అర్థం అయింది కదా! ఇప్పుడు చెప్పండి మీ అభిప్రాయం, మీరు నాకిచ్చే సలహా, ఏవిటోను' అంది భామ ఆవేశంగా.

'అసలు నీ సమస్య ఏవిటో నాకు అర్థం కాలేదు' అంది లక్ష్మి అయోమయంగా చూస్తూ.

'ఇంత విడమరచి చెప్పాక కూడానా?' అసహనంగా అరిచింది సత్యభామ.

'నువ్వు ఫలానా వస్తువు కావాలంటే కొనిపెట్టడా'? అనునయిస్తూ అడిగింది లక్ష్మి.

'కొనకేం? కాని, ఆ కొనడంలోనే - ఏడ్చే పిల్లని ఊరుకోబెట్టడానికి, ఏదో తప్పనిసరిగా కొంటున్నట్లుంటుంది. ఓ ప్రేమా, మురిపెం కనిపించదు. ఎందుకు కొనమని అడిగానా అని తర్వాత విచారిస్తాను. సరదా చచ్చిపోతుంది. ఇదంతా ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడంవల్ల వచ్చింది కదా - నేనూ ఏదైనా ఉద్యోగం చేసి పది రూపాయలు సంపాదించుకొంటే, ఈ దేవురింపు బ్రతుకు ఉండకపోను గదా అని అనిపిస్తుంది'.

ఈ మాటలు అంటూన్నప్పుడు సత్య గొంతు దు:ఖంతో పూడుకుపోయింది.

'నిన్ను తరుచు విసుక్కోవడం, కేకలెయ్యడం లేదు కదా?' - లక్ష్మి ప్రశ్నలో మాతృత్వం తొణికిసలాడింది.

'ఆ.... ఇంక అదొక్కటే తరవాయి... అయినా ఆయన చేత కేకలేయించుకొనేటంతటి తెలివి తక్కువ పని నేనెందుకు చేస్తాను?'' పౌరుషంగా అంది భామ.

'అమ్మా! సత్యా - నేనొక్కటి అడుగుతాను చెప్పు. నిన్ను ప్రేమగా చూస్తాడా?... అంటే .... పడకటింట్లో పలకరించడం - బ్రతిమాలడం .. వెనకాలే పడ్డం.. చిలిపి పనులూ...' సీతమ్మ ఇంకా వాక్యం పూర్తి చెయ్యనేలేదు... 'ఫో బామ్మా' అంది సత్య... ముఖం సిగ్గుతో ఎర్రబడింది. అది చూసిన సీతమ్మ మనసు కుదుటబడింది.

మగాడు ఆడదాని వెనకాల వెంపర్లాడుతున్నాడంటే, ఆ కాపురం గురించి బెంగ ఏం పడక్కర్లేదు, లంగరేసిన ఓడలాగ నిర్భయంగా ఉందన్నమాటే!

సత్యభామ సిగ్గుతో తలవంచుకొని నేలకేసి చూస్తూ, కాలి బ్రొటనవేలితో గచ్చుమీద అర్ధచంద్రాకారాలు చుడుతూ ఉంటే, లక్ష్మి, సీతమ్మా ఒకరికేసి ఒకరు చూసుకొని ముసి ముసిగా నవ్వుకొన్నారు.

ఒక్క క్షణం ముగ్గురి మధ్యా మౌనం రాజ్యమేలింది.

'అవును గానీ - నా సమస్య ఇదీ అని చెప్తే, దానికి పరిష్కార మార్గం చెప్పకుండా మీరేవో పిచ్చి పిచ్చి ప్రశ్నలేస్తారేవిటి నన్ను?' నడ్డిమీద చేతులెట్టుకుని ముందుకొచ్చి మరీ అడిగింది సత్య, తల్లినీ, బామ్మనీ.

'మాకు తోచిందేదో మేం చెప్తాంలే తర్వాత. ముందు నువ్వేం చేద్దాం అనుకుంటున్నావో చెప్పు' ఇలా అడిగి ముందుగా లాయరు భార్యననిపించుకొంది సీతమ్మ.

'అవును తల్లీ - నీ మనస్సులో మాట చెప్పు' అంది లక్ష్మి.

'అయితే వినండి - మీరీ విషయంలో నాకు సాయం చెయ్యాలి. నాన్నా, తాతయ్యా ఎంతయినా మగవాళ్ళు. వాళ్ళ మగ బుద్ధి పోనిచ్చుకోరు. వాళ్ళు ఆయన్నే సమర్థిస్తారు. నా బాధని అర్థం చేసుకోడానికి ప్రయత్నించరు. అందుకే ఈ నాలుగైదు రోజుల నుంచీ చూసి చూసి, వాళ్ళిద్దరూ ఇంట్లో లేని సమయం కనిపెట్టి, ఇప్పుడు మీతో ఈ సంగతి ప్రస్తావించాను' అంది సత్య కొద్దిగా గొంతు తగ్గించి రహస్యం చెబుతున్నట్లు -

'అలాగే! మన ఇబ్బందులు మనవి. మనమే చూసుకోవాలి. ఆడ మనసు వాళ్ళకేం అర్థమవుతుంది?' అందిసీతమ్మ.

'బామ్మ ఎంత బాగాగ్రహించింది' అని సంతోషించింది భామ.

'చెప్పమ్మా - నీఅభిప్రాయం చెప్పు'

'అయితే వినండి -ఆయనతో నేనింక కాపురం చెయ్యలేను. విడాకులిచ్చెయ్యడానికి నిర్ణయించుకున్నా.'

పిడుగుపడ్డట్టు సీతమ్మా, లక్ష్మి, ఇద్దరూ ఆ మాటకి నివ్వెరపడి ఉండిపోయారు.

ఒక్కరి ముఖంలోనూ చైతన్యం లేదు.

ఒక్కరి కళ్ళల్లోనూ కాంతి లేదు.

ఒక్కరి గొంతులోనూ మాటలేదు.

చేష్టలు దక్కి నిశ్శబ్దంగా ఉండిపోయారు.

'ఏం? మాట్లాడరేం? అదీ నా నిర్ణయం, అంది భామ నిశ్చలంగా.

విద్యుద్ఘాతం లాంటి ఆ మాటనుంచి అయిదు నిముషాలు పోయాక తేరుకొని 'అయితే అతనితో అలా తెగతెంపులు చేసుకొనే వచ్చేశావా?' అనడిగింది సీతమ్మ.

'బయలుదేరి వచ్చేటప్పుడు విడాకులు' అనే మాట నువ్వు అన్నావా, అతను అన్నాడా' ఆదుర్దాగా ప్రశ్నించింది లక్ష్మి.

'నువ్వు బయల్దేరి వచ్చేటప్పుడు నువ్వూ అతగాడూ తగవులాడుకున్నారా ఏవిటమ్మా' అనడిగింది సీతమ్మ -

'తగవులూ ఆడుకోలేదు - విడాకులూ అనుకోలేదు'. మా అమ్మనీ వాళ్ళనీ ఓ మారు చూసి రావాలి, అన్నాను. 'నాకు శలవులేద'న్నారాయన. 'మీరు రానక్కర్లేదు - నేను ఒక్కత్తెనే వెళ్తా' నన్నాను. 'అయితే వెళ్ళు' అన్నారు. వచ్చేశాను - అంతే!'

'మరి విడాకులేవిటి?'

'అది నేను ఎంతోకాలంగా అనుకుంటూన్న విషయం'

'కారణం?' గట్టిగా గద్దిస్తూనే అడిగింది సీతమ్మ.

'అంతా విని మళ్ళీ అదేం ప్రశ్న బామ్మా!'

'నువ్వు చెప్పిన వాటిల్లో ఏదీ, విడాకులుతీసుకోవలసినంత తీవ్రమైనది లేదు మరి!"

'లేవూ? నే చెప్పినవన్నీ తీవ్రమైనవి కావా? ఆర్థిక స్వాతంత్ర్యం లేకుండా, అభిమానం అణచుకొని, వ్యక్తిత్వం చంపుకొని, బ్రతకడం కంటే తీవ్రమైనవి ఏవిటి?" భామ కంఠం కంచులా మ్రోగింది.

'పిచ్చి పిల్లా! జీవితంలో ఇంతకంటే తీవ్రమైనవి చాలా ఉన్నాయమ్మా' నిట్టూరుస్తూ అంది సీతమ్మ.

'ఇంతకంటేనా?'

'అవునమ్మా! మీతరం అమ్మాయిలకి ఇవే భరించలేని సమస్యలుగా కనిపిస్తున్నాయి' అంది లక్ష్మి బాధగా.

'అమ్మా - నువ్వు కబుర్లు చెప్పకు. అనుభవించిన వాళ్ళకి తెలుస్తుంది బాధ. నీకూ బామ్మకీ బాధలేం తెలుసు? సమస్యలులేని అదృష్ట జీవులు మీరు. తాతయ్యా నాన్నా

లాంటి దేవుళ్ళు దొరకడం వల్ల, స్థిమితంగా ఎన్నయినా చెప్తారు మీరు -అసలు మా తరం స్త్రీలకి ఉన్న బాధలు...'

'బాధ అన్నాక ఏ తరం వాళ్ళకైనా బాధ బాధే...' అంది సీతమ్మ.

'ఇంత కంటే పెద్ద బాధలే ఉన్నాయమ్మా మీ తరం అమ్మాయిలు ఊహించనివీ, మాతరం వాళ్ళు పెదవి కదపకుండా ఓర్పుతో భరించినవీను. పరిస్థితుల్లో మార్పులు వచ్చి, మీ ఆలోచనల్లోచైతన్యం వచ్చి, చిన్న ఇబ్బందికి కూడా పెద్దగా స్పందిస్తున్నారు - మీరు. ప్రతిస్పందనకీ ఆందోళనచెంది, అన్నింటికీ తెగతెంపులే పరిష్కారం అనుకుంటున్నారు. మా తరం వాళ్ళు, అందులో నేనూ, మీ బామ్మలాంటి వాళ్ళం ఎదుర్కొన్న సమస్యలతోపోలిస్తే అసలు మీవి సమస్యలే కావు. తెలుసా?" అంది లక్ష్మి ఆవేశంగా.

"మీకు?... మీకు సమస్యలా?... నీకూ... బామ్మకీ...?" ఆశ్చర్యంగా అడిగింది సత్య.

'ఏం? మీ కాలం అమ్మాయిలకే కాని, మా కాలం ఆడవాళ్ళకి సమస్యలు ఉండవా? మేమూ పురాషాధిక్యత గల ప్రపంచంలో అనుక్షణం పోరాడుతూ వచ్చినవాళ్ళమే! మా సమస్యలేవో తెలుసు కోవాలని ఉందా?"

సత్యభామ తెల్లబోయి చూస్తోంది.

'మీ బామ్మగారు కాపురానికి వచ్చిన పదేళ్ళదాకా, నువ్వు దేవుడు అనుకుంటూన్న మీ తాతగారికి, అవతల వీధిలో వేరే ఇంకొక ఆమెతో పరిచయం ఉండేదట - మీ నాన్నగారికి అయిదారేళ్ళు వచ్చాక, ఒకటి రెండు మార్లు ఆయన కళ్ళబడ్డాక 'ఆవిడెవరు నాన్నా?' అని అడిగాక, అప్పుడు రాసక్రీడలు ఆగాయి మీతాతగారికి. తెలిసిందా?" అంది లక్ష్మి.

"మీ నాన్నా అంతే - వాడు కూడా ఇవాళ కనిపిస్తున్నంత మంచివాడు కాదు. వాడితో మీ అమ్మ నానా బాధలూ పడింది. నువ్వు పుట్టిన రెండేళ్ళ దాకా మీ నాన్నకి క్లబ్బులూ, పేకాటలూ వాటికి సంబంధించిన రెండు మూడు దుర్వ్యసనాలూ ఉండేవి. ఇప్పుడు చెప్పు. మేంఎదుర్కొన్న సమస్యల కంటే, నీకు వచ్చిన సమస్యలు తీవ్రమైనవా?' సీతమ్మ నిలదీస్తూ అడిగింది.

'నిజంగానా? మరి అలాంటి కష్టాలు వచ్చినప్పుడు విడాకులిచ్చి పారెయ్యకపోయారూ?'

'అప్పట్లో ఆడవాళ్ళకి ఆ అవకాశం లేదు' అంది లక్ష్మి.

'ఒకవేళ ఉన్నా, మళ్లీ ఇంకో మగాడిని చేసుకున్నా, వాడు సత్పురుషుడు

అవుతాడన్న గ్యారంటీ ఏం ఉంది? వాడు ఎలాంటి దుర్మార్గుడు అవుతాడో - అయినా అన్ని సమస్యలకీ విడాకులే పరిష్కారం కాదమ్మా' అంది సీతమ్మ విచారంగా.

'మరి, అంత ఘోరమైన పరిస్థితిని మీరిద్దరూ ఎలా ఎదుర్కొన్నారు? ఆ సమస్యలని చివరకి ఎలా పరిష్కరించుకున్నారు?'

'ఎలాగా? సావధానంగా విను' అంటూ సీతమ్మ రేపీమని శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేస్తూన్న పోజులోకి వచ్చి నిలబడింది.

ఆ పోజు చూసి సత్యభామ 'అదేవిటి బామ్మా!' అంటూ పకపకా నవ్వింది.

"అవునే - ఇప్పుడు నేను చేసేది గీతోపదేశమే - సావధానంగా విను".

" దాంపత్యోపనిషత్తులో, సమస్యలని ఎదుర్కొని పరిష్కరించుకోమని ఉంది కాని, విడాకులిచ్చెయ్యమనీ, కాపురాలు వదులుకొని పారిపొమ్మనీ లేదు. అది పిరికితనం. సమస్యల నుంచి మగాడు పారిపోతాడు కాని, మనం, ఆడవాళ్ళం అలా చెయ్యకూడదు. ఏమంటే, స్వతహాగా మగాడికి లేని కొన్ని శక్తుల్ని ప్రకృతి మనకి వరాలుగా ప్రసాదించింది. ఇష్టం లేని మగాడిని మనం వప్పించగలం - ఇష్టంలేని ఆడదాన్ని, తల క్రిందులుగా తపస్సు చేసినా మగాడు వప్పించలేడు. ఎందువల్ల? మన దగ్గర కొన్ని ఆయుధాలున్నాయి. సమయస్ఫూర్తి, చాకచక్యం - గడుసుదనం - వీటితో చంటి కుర్రాడిని చేసెయ్యొచ్చు ఎంతటి మగాడినైనా - ఒకప్పుడు మంచిగానూ, మరొకప్పుడు కరుకుగానూ ఉంటూ, వక్రమార్గానపడిన మగాడిని, సక్రమమైన మార్గానికి మళ్ళించి, అతణ్ణి చెంగున ముడేసుకోవాలి, తెలివైన ఆడది, తెలుసా?"

"ఎందుకంత శ్రమ పడాలి?"

"ఎందుకేవిటే వెర్రిమొహమా? మగాడిని అంతటంతట వదుల్తామా ఏవిటి? వాడికంటే మనం అధికులం అని నిరూపిస్తాం - పోరాడి ఓడించి సాధిస్తాం - మీలాగ మా తరం వాళ్ళకి పిరికి తనం లేదు. పారిపోవడం అసలే లేదు. మా శక్తి మాకు తెలుసు. - అందుకే, నయాన్నో, భయాన్నో, బ్రతిమాలో, బెదిరించో, మగాడిని మాకు అనుకూలంగా మలుచుకొనే వాళ్ళం - ఓ భామా! మనం అంతా సత్యభామ వారసులమే!" అంది సీతమ్మ.

బామ్మ నవ్వులో భామ కూడా నవ్వు కలిపి, 'సరే అయితే - సత్తెకాలపు స్త్రీగా ఉండమంటే ఒప్పుకోనుగానీ సత్యభామగా ఉండమంటే, ఓ - కే' అంది.

'హమ్మయ్య' అని పెద్ద భారం తీరినట్లు నిట్టూర్చారు, కొత్తతరం కొత్త నిర్ణయానికి, పాత తరం లక్ష్మి, సీతమ్మా, పరవశించిపోతూ -

*(1991 రచన)*